చాచా నెహ్రూ సేవలు చిరస్మరణీయం



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: దేశానికి చాచానెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పంచవర్ష ప్రణాళికలతో పాటు స్వాతంత్ర్య భారత దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలోకి తీసుకెళ్లిన ఘనత నెహ్రూకే దక్కుతుందన్నారు. నెహ్రూ ఆశయాలు, ఆదర్శాలతో నవ సమాజ నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, చిరంజీవి, రమేష్, శ్రీనివాస్, రాజేందర్, గజారామ్, మార్కెండయ్య, సీపీ శంకర్, వేద ప్రకాష్, అశీష్ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ కార్యాలయంలో..

లాలాపేట: భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నెహ్రూ చిత్రపటం వద్ద డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పూలమాలతో ఘనంగా నివాళి అర్పించారు. భారతదేశానికి స్వాతంత్ర్య సముపార్జనలో నెహ్రూ కీలకపాత్ర పోషించారని తొలి ప్రధానిగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మోతే శోభన్‌రెడ్డి, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!

- ఇప్పటికే పాఠశాలలకు సరఫరా
- పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సికింద్రాబాద్ మండల డిప్యూటీ ఈఓ శ్రీకాంత్

సనత్‌నగర్: జూన్ 12 పాఠశాలల పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపు పాఠ్య పుస్తకాలను అన్ని పాఠశాలలకు చేరవేసేందుకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీతోనే విద్యా సంవత్సరం ప్రారంభించే యోచనలో ఉన్నారు. ఆ మేరకు ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ షురూ చేశారు. విద్యాశాఖ సికింద్రాబాద్ జోన్ పరిధిలో మొత్తం 15 ఉన్నత, 34 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. సికింద్రాబాద్ మండలం-1 పరిధిలో 6 ఉన్నత, 10 ప్రైమరీ, మండలం-2 పరిధిలో 9 ఉన్నత, 24 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గం ప్రధానంగా సికింద్రాబాద్ మండలం-1, మండలం-2, అమీర్‌పేట మండలం, బాలానగర్ మండల పరిధుల్లో విస్తరించి ఉంది.

12న పంపిణీ..

సికింద్రాబాద్ మండలం 1, 2ల పరిధి కిందికి వచ్చే బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్లలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఇప్పటికే దాదాపుగా అన్ని పాఠశాలలకు పుస్తకాలు చేరిపోయాయి. సికింద్రాబాద్ జోన్ పరిధిలో 15 వేల పైచిలుకు విద్యార్థులు చదువుతున్నారు. కొత్తగా చేరుతున్న వారితో కలిపి వచ్చే నెల 12న వీటిని పంపిణీ చేయనున్నారు. ప్రతి ఏడాది లాగానే ఈ విద్యా సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం ముందే ముద్రణకు శ్రీకారం చుట్టి మే నెలలోనే పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేస్తుండడంతో విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా కొత్త విద్యార్థుల నమోదు కూడా పెరుగుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్లం..

ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్లం రెండు మాధ్యమాల్లో ముద్రించబడ్డాయి. పార్ట్-1, పార్ట్-2 చొప్పున ఏడాదికి రెండు సార్లు పంపిణీ చేస్తున్నారు. రెండు మాధ్యమాల వారు వీటిని చదువుకునే వీలు కల్పించారు. రెండేళ్ల క్రితం తొలిసారిగా 3 నుంచి 8వ తరగతి వరకు సరఫరా చేశారు. గతేడాది 9వ తరగతి, ప్రస్తుతం 10వ తరగతి వరకు ద్విభాషా పుస్తకాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అమీర్‌పేట, బాలానగర్‌కు చేరని పుస్తకాలు..

విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే అమీర్‌పేట, అలాగే బాలానగర్ మండల పరిధిలోని పాఠశాలలకు ఇంకా పాఠ్యపుస్తకాలు చేరలేదు. జూన్ 1 వరకు ఆయా పాఠశాలలకు పుస్తకాలు చేరే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏదేమైనా పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరిపోతాయని చెబుతున్నారు. పుస్తకాల పంపిణీతోనే పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, ఎయిర్‌పోర్ట్, లోధా, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, పోలీస్‌స్టేషన్, లక్కీ బేకరీ వెనుక ప్రాంతం, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ బస్టాండ్, ఫతేనగర్ రైల్వే స్టేషన్, బేగంపేట జబ్బార్ బిల్డింగ్, మోతీలాల్‌నెహ్రూనగర్, షేర్‌ఖాన్‌బస్తీ, గగన్‌విహార్ కాలనీ, భగవంతాపూర్.
- మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు సనత్‌నగర్ మంగళవారం మార్కెట్ రోడ్డు, ఎస్ఆర్‌టీకాలనీ పార్క్, మీ-సేవా రోడ్డు, సౌభాగ్యనగర్, బేగంపేట భగవంతాపూర్, ఎయిర్‌పోర్ట్ క్వార్టర్స్, గగన్‌విహార్‌కాలనీ.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు సనత్‌నగర్ డీఎస్ఎంకాలనీ, కైలాష్‌నగర్, ఎస్ఆర్‌టీకాలనీ పార్క్, బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, ఆర్ఆర్ గోపాల్ కాంపౌండ్ ఏరియా, బ్రాహ్మణవాడీ, మాతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 28, గుండుబీన్స్ 155, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 17, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 31, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

విశాల్ సూదంకు బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకున్న విశాల్ సూదం

సనత్‌నగర్: నగరంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన పెన్ మహోత్సవ్‌లో భాగంగా పటేల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ నెట్‌వర్క్ (తెలంగాణ మున్నూరు కాపు) నిర్వహించిన 'రిటైల్ ట్రేడ్ అండ్ సర్వీస్ ఇండస్ట్రీ' విభాగంలో బేగంపేటకు చెందిన బ్లిట్‌జాస్ పెట్‌మార్ట్ అధినేత విశాల్ సూదం బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

ఉత్సాహంగా పెయింటింగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సనత్‌నగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు నివారణ' థీమ్‌ను యునైటెడ్ నేషన్స్ ప్రకటించింది. ఈ అంశంపై అవగాహన కల్పించే లక్ష్యంగా టీజీపీసీబీ ఆడిటోరియంలో చిన్నారులకు పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారులు వేసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. భూమి, నీరు, గాలి, ప్లాస్టిక్, అటవీ నిర్మూలన, శక్తి, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెంపొందించడం వంటి తదితర అంశాలపై చిన్నారులు చిత్రాలు వేసి అబ్బురపరిచారు. భూమిని రక్షించడానికి అవసరమైన చేపట్టాల్సిన చర్యలపై 200 మందికి పైగా విద్యార్థులు చిత్రాలను వేసి సందేశాన్ని అందించారు. విజేతలకు సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ తెలిపారు.

హత్యాయత్నం.. ఆపై దారి దోపిడీ



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్

ఇద్దరి రిమాండ్, జువైనల్ హోమ్‌కు మైనర్

అడ్డగుట్ట: పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి పారిపోతూ దారి మధ్యలో తన స్నేహితులతో కలిసి మరో వ్యక్తిని బెదిరించి అతని వద్ద సెల్‌ఫోన్, డబ్బులను లాక్కెళ్లిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. నార్త్ లాలాగూడలోని జామియా మసీదు ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ ఆసిఫ్ రెహ్మాన్(31) అలియాస్ టైగర్ అనే వ్యక్తి ఆటోడ్రైవర్. తన ఇంటి సమీపంలో నివాసముండే తాడూరి కృష్ణ అనే వ్యక్తితో పాత గొడవలు ఉన్నాయి. అవి మనసులో పెట్టుకున్న ఆసిఫ్ ఈ నెల 24న కృష్ణపై కత్తితో దాడి చేయగా, అతని మెడపై గాయమైంది. దీంతో అక్కడి నుంచి పరారైన ఆసిఫ్ తన స్నేహితులైన సోహెల్ షేక్ చాంద్(19) అలియాస్ సోహెల్, మరో బాలుడితో రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లిపోయారు. ఈ క్రమంలో లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో మహ్మద్ అఫ్రోజ్ అనే వ్యక్తికి కత్తి చూపించి బెదిరింపులకు పాల్పడి, అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.70 లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కత్తి, సెల్‌ఫోన్, బైక్‌లకు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించి బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆసిఫ్ రెహ్మాన్‌తో పాటు మైనర్ బాలుడిపై పలు కేసులు ఉన్నట్లు డీసీపీ గిరిధర్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఏసీపీ జైపాల్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్ఓ రమేష్ గౌడ్, ఎస్ఐలు నాగరాజు యాదవ్, షాహీద్ పాషా, కానిస్టేబుళ్లు నాయుడు, రాజశేఖర్, సుమంత్, జగదీష్, నవీన్, గణేష్, వినయ్, గలిబ్, వేణు పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనాలను చూపిస్తున్న పోలీసులు

సెల్‌ఫోన్ స్నాచింగ్ ఘటనలో ముగ్గురు..

నార్త్ లాలాగూడ ఇందిరనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సోహెల్(19) మిర్జాల్‌గూడకు చెందిన మహ్మద్ మెహబూబ్(19) ఈ నెల 23న విజయపురి కాలనీలోని మీసేవా వద్ద సురేష్ అనే కొరియర్ బాయ్ ఫోన్ మాట్లాడుతుండగా ఫోన్ లాక్కొని పరారయ్యారు. సీసీ పుటేజీల ఆధారంగా గుర్తించిన పోలీసులు దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేస్తున్న జగదీష్ మార్కెట్‌కు చెందిన షకీల్ ఖాన్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీసీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి

పంజగుట్ట: రాష్ట్రంలోని బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చి ప్రతి కార్పొరేషన్‌కు రూ. వంద కోట్ల నిధులను విడుదల చేయాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం తుమ్మలబస్తీలోని వేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీల హక్కులను సాధించుకునే అవకాశం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని.. లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీసీల డిమాండ్లు ఉద్యమరూపం దాల్చకముందే ప్రభుత్వం అన్నిరంగాల్లో బీసీలకు న్యాయం చేయాలన్నారు. నగర అధ్యక్షుడు ఎ.వెంకటేష్ గౌడ్, బి.ప్రకాశ్ సింగ్, కె.మురారి, శ్రీనివాస్ చారి, రుక్మిణి, కొండపర్తి జ్యోతి, గుల్లపల్లి విజయలక్ష్మి, కిషన్, డి.ఆనందంగౌడ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుల అరెస్ట్

ఖైరతాబాద్: ఎన్‌డీపీఎస్, ఆర్మ్స్ యాక్టు కింద ముగ్గురు నిందితులను సోమవారం ఖైరతాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సమాచారం మేరకు... ఖైరతాబాద్‌కు చెందిన పొదిల ప్రకాష్ రాజ్ అలియాస్ డాలర్ పింటు(23), తాళ్లగడ్డ కార్వాన్‌కు చెందిన జాదవ్ రోహన్ సింగ్ ఎలియాస్ ఫన్నీ రోహన్(21), అయ్యప్ప సొసైటీకి చెందిన హస్మత్ నితిన్ గౌడ్ అలియాస్ నిక్కి(20) ముగ్గురు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని తనిఖీ చేయగా వారి నుంచి డాలర్ పింటు వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి, కత్తి, బాకు స్వాధీనం చేసుకున్నారు. ఫన్నీ రోహిత్ జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, పోక్సో యాక్ట్ కింద నేరస్తుడు. నితిన్ గౌడ్ పాత నేరస్తుడు కావడంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి వేళల్లో వీరు గంజాయి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఎవరైనా పట్టుకునేందుకు ప్రయత్నిస్తే మారణాయుధాలతో దాడి చేస్తారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సైఫాబాద్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

కాచిగూడ: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ మహిళను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావేద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప మాట్లాడుతూ.. కొత్తగూడెంకు చెందిన ఉపేందర్, పుష్ప దంపతులు మణుగూర్ వెళ్లేందుకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి రైలు ఎక్కారు. సీట్లో బ్యాగు, లగేజీ పెట్టి బంధువులకు వీడ్కోలు చెప్పడానికి రైలు డోర్ వద్దకు వచ్చి, తిరిగి వెళ్లేసరికి బంగారు ఆభరణాలు, నగదు, విలువైన బట్టలు ఉన్న బ్యాగు కనిపించలేదు. దీంతో బాధితులు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు, ఖరీదైన బట్టలు ఉన్నాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా కనిపించడంతో..

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కామారెడ్డి బాన్సువాడ ప్రాంతానికి చెందిన తిరుపతి భార్య దాసరి మంజుల (31)ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం అంగీకరించిందని పోలీసులు తెలిపారు. ఆమె నుంచి 56 గ్రాముల బంగారు ఆభరణాలు, బట్టలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు యత్నం

కాపాడిన రైల్వే పోలీసులు



నర్సింహులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

అడ్డగుట్ట: రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని రైల్వే పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.వెంకట్‌రెడ్డి తెలిపారు. శామీర్‌పేట్‌లోని అలియాబాద్‌కు చెందిన నర్సింహులు(25) రంగారెడ్డి జిల్లాలోని తూముకుంటలో రోజువారి కూలిపని చేస్తుంటాడు. మద్యానికి బానిసైన ఈ నెల 26న సాయంత్రం సమయంలో సికింద్రాబాద్ నుంచి జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ వెళ్లే మార్గమధ్యలో పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు యత్నించాడు. అదే సమయంలో అక్కడ ట్రాక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు గమనించి చాకచక్యంతో అదుపులోకి తీసుకుని తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారికి అప్పజెప్పారు.

బీజేపీ నేతపై ట్రెస్ పాసింగ్ కేసు నమోదు

అడ్డగుట్ట: ఇతరుల స్థలంలో అక్రమంగా చొరబడి విద్యుత్ మీటర్ బిగించిన బీజేపీ నేత, ఫిషరీస్ బోర్డు మాజీ సభ్యుడిపై ట్రెస్ పాసింగ్ కేసు నమోదైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జనార్ధన్ (49) అడ్డగుట్ట డివిజన్ పరిధిలో నరేష్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో ఇటీవల అక్రమంగా చొరబడి సదరు స్థలంలో అక్రమంగా వి ద్యుత్ మీటర్ కూడా బిగించాడు. స్థల య జమాని నరేష్ ఫిర్యాదు మేరకు ట్రెస్ పాసింగ్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతి




మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: తెలంగాణ వ్యాప్తంగా గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించి దాదాపు ఏడాది కావస్తోందని డీడీలు చెల్లించిన వారికి న్యాయం చేయాలని వినతిలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాంచందర్ యాదవ్, మధుయాదవ్, గజ్జి రమేష్ యాదవ్, ఆవుల రాజు యాదవ్, కాటవేణి మహేశ్ యాదవ్, సాయన్న పాల్గొన్నారు.

పార్కింగ్ సరిగా లేని 36 డౌన్‌టౌన్ పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: పార్కింగ్ సౌకర్యం తగినంత కల్పించుకోకుండా కస్టమర్ల వాహనాలను రోడ్ల పక్కనే పార్కింగ్ చేయిస్తూ ట్రాఫిక్ జాంలకు కారణమవుతున్న జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని 36 డౌన్‌టౌన్ పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 341, 290ల కింద క్రిమినల్ కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ ఎ.నరసింహారావు, హోంగార్డు వీరప్రసాద్‌రెడ్డిలు ఆదివారం రాత్రి 10.45 గంటల సమయంలో రోడ్డు నెంబర్-36 నుంచి వెళ్తుండగా డౌన్‌టౌన్ పబ్ రోడ్డు పక్కన పెద్ద ఎత్తున కస్టమర్ల కార్లు అక్రమంగా పార్క్ చేసి ఉండడం గమనించారు. ఈ అక్రమ పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్ సజావుగా సాగకుండా ట్రాఫిక్‌జాం అవుతుందని, సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడం వల్లనే ఈ సమస్య తలెత్తిందని గుర్తించి ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోనే ఉన్న జనాపబ్ ముందు కూడా రోడ్ల పక్కన వాహనాలు అక్రమ పార్కింగ్ చేసి ఉండడంతో ఈ రోడ్డులో కూడా ట్రాఫిక్ జాం అవుతున్నదని, దీనిపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ద టైటాన్ ఆఫ్ ట్రూత్' పుస్తకావిష్కరణ



పంజగుట్ట: తెలుగు, ఆంగ్ల జర్నలిజాలు కోల్పోయిన ఆణిముత్యం జర్నలిస్టు భళ్లమూడి రామకృష్ణ (ఆర్కే) అని పలువురు వక్తలు అభివర్ణించారు. 2021లో కరోనా మహమ్మారికి బలైన ఆర్కే 57వ జయంతి సందర్భంగా ఆయన సేవలను నెమరుమేసుకుంటూ సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ద టైటాన్ ఆఫ్ ట్రూత్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ జె.వి. ప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వృత్తి నిబద్ధతతో పనిచేసే ఎంతో మంది జర్నలిస్టులకు స్ఫూర్తి ఆర్కే అని, ఆయన లేని లోటు తీర్చలేమన్నారు. హాస్య బ్రహ్మ శంకర నారాయణ మాట్లాడుతూ... సాహితీ ప్రియత్వం, హాస్య ప్రియత్వం కలబోత రామకృష్ణ అన్నారు. ఆర్కే మరణం జీర్ణించుకోవడానికి తనకు యాడాదిన్నర పట్టిందని ఆంధ్రప్రదేశ్ దేవాలయ పాలన సంస్థ మాజీ సంచాలకుడు ద్రోణంరాజు రామచంద్రరావు అన్నారు. ప్రముఖ పర్సనాలిటీ డవలప్‌మెంట్ నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ... నాణ్యమైన జర్నలిజానికి రామకృష్ణ పర్యాయపదమన్నారు. ధాత్రి కమ్యూనికేషన్స్ అధిపతి పమిడికాల్వ మధుసూదన్, సీనియర్ జర్నలిస్టులు ప్రేమ, రాజేశ్వరి కళ్యాణం, డాక్టర్ ఎస్.రాము, పెమ్మరాజు వెంకటేశ్వరరావులు ఆర్కేతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్కే సతీమణి వందన ద్విభాష్యం, కుమార్తె లాస్యలను జర్నలిస్టులు అభినందించారు. పెద్దసంఖ్యలో జర్నలిస్టులు కార్యక్రమానికి హాజరయ్యారు.

బీసీలను యూనివర్సిటీల వీసీలుగా నియమించాలి

లిబర్టీ: తెలంగాణలోని విశ్వవిద్యాలయాలకు బీసీలను వైస్ చాన్సలర్లను నియమించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దళ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10 విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల పదవీ కాలం ముగిసిందన్నారు. ఆయా స్థానాల్లో తాత్కాలికంగా ఐఏఎస్‌లో నియమించారని తెలిపారు. వైస్ చాన్సలర్‌ల నియమక కోసం ఇప్పటికే ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించ్చిందన్నారు. 10 యూనివర్సిటీలలో బీసీ పదవుల్లో జనాభా దృష్టిలో పెట్టుకొని కనీసం ఐదుగురిని వీసీలుగా బీసీ ప్రొఫెసర్లను నియమించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

జూన్ 9న ఎమ్మెల్యే కాలనీ సొసైటీ ఎన్నికలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని శ్రీవెంకటేశ్వర కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీ ఎన్నికలు జూన్ 9న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ జారీ చేశారు. ఆ నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డులో అతికించారు. జూన్ 1న నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంటాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జూన్ 5 వరకు నామినేషన్ ఉపసంహరణ, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను గుర్తులతో సహా ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. జూన్ 9న ఎన్నికలు, సాయంత్రానికి ఫలితాలు వెలువడతాయని వివరించారు.

నేటి నుంచి హనుమాన్ తిరునక్షత్ర మహోత్సవాలు

శ్రీనగర్‌కాలనీ: మధురానగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి శనివారం వరకు ఐదు రోజులపాటు శ్రీ హనుమాన్ తిరునక్షత్ర మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి టి.ఎన్.రావు తెలిపారు. శ్రీమాన్ ఎమ్‌టీ ఆళ్వార్‌చే హనుమాన్ వైభవ ప్రవచనాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో మహోత్సవాలకు విజయవంతం కావాలని ఆయన కోరారు.

మంత్రివర్గంలో మాలలకు సముచిత స్థానం కల్పించాలి

లిబర్టీ: మంత్రివర్గంలో మాలలకు సముచిత స్థానం కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ కోరారు. ప్రస్తుతం మంత్రివర్గంలో 12 మంది ఉండగా ఒకే వ్యక్తికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాల సామాజిక వర్గానికి చెందిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. దళితుల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు పలుమార్లు అచ్చంపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పక్షాన ఎమ్మెల్యేగా విజయం సాధించారన్నారు.

పర్యావరణంపై అవగాహన



డంపింగ్ యార్డు గురించి విద్యార్థులకు వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అడ్డగుట్ట: పర్యావరణంపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు విహారయాత్రకు తీసుకెళ్లి వివరించినట్లు యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుమతి తెలిపారు. ఆదివారం అడ్డగుట్ట, అంబేడ్కర్ నగర్, మడ్‌ఫోర్ట్‌కు చెందిన సుమారు 32 మంది పిల్లలను సైనిక్‌పురి వద్దనున్న డంపింగ్ యార్డ్ వద్దకు తీసుకెళ్లారు. పర్యావరణంపై అవగాహన కల్పించడంతో పాటు, చెత్త సేకరణ, రీసైక్లింగ్ ఆఫ్ వేస్టేజ్ గురించి వివరించినట్లు తెలిపారు.